# వేళ్ళు

అడ్డ రోడ్డు దగ్గర బస్సాగింది.

విఐపి బ్రీఫ్ కేసుతో దిగాడు ప్రభవ్.

బస్సు కదిలిందో లేదో గాలికి ఎర్ర దుమ్ము చుట్టేసిందతడ్ని.

కళ్ళు మూసుకుని పక్కకి తిరిగాడు సుడిగాలి తగ్గాక కర్చీఫ్‌తో మొఖం చేతులూ తుడుచుకున్నాడు. జేబులోంచి రేబాన్ కూలింగ్ గ్లాసెస్ తీసి తుడిచి పెట్టుకున్నాడు.

ఎదురుగా ఎగుడు దిగుడు ఎర్ర కంకర రోడ్డు వెక్కిరిస్తున్నట్టుగా కనిపించింది. ఎండ చురుక్కుమంటోంది.

టైము చూసుకున్నాడు. పదీ ముప్పై అయిదు.

బ్యాంకు టైము దాటిపోయినందుకు కించిత్తు ఆదుర్దాగా వుంది. దాని కన్నా నాలుగు కిలో మీటర్లు నడిచెళ్ళాలే అని బెంగపడ్డాడు.

ఎవరైనా లిఫ్ట్ ఇస్తారేమోనని చుట్టూ చూశాడు. ఎవ్వరూ లేరు. ఒకతను మాత్రం దూరంగా నిలబడి చూస్తున్నాడు.

ఉస్సురని నిట్టూర్చాడు. ఆ మారుమూల పల్లెని కసిదీరా తిట్టుకుంటూ ముందుకి నడిచాడు.

నాలుగడుగులేశాడో లేదో "నమస్కారం మేనేజరుగారూ" అంటూ

పరుగున వచ్చాడు అంత వరకూ దూరాన నిలబడి చూస్తున్నతను.

తల పంకించాడు ప్రభవ్.

"ఇయాల బస్సులో ఒచ్చేరు. తమరి స్కూటరు బండికేవయ్యిం దండి ?"

"సర్వీసింగ్ కిచ్చాను. ఈ వెధవ రోడ్లంట తిరిగితే ఎలాటి బండైనా పది రోజులకే సర్వీసింగు కొచ్చేస్తుంది"

"బాగా సెప్పేరు" అంటూ బ్రీఫ్ కేసు అందుకుని అతడి వెనకే నడవసాగాడు గ్రామస్తుడు.

అతనితో మాటలు కలపాలనించలేదు ప్రభవ్‌కి. చాలా విసుగ్గా చిరాగ్గా అసహనంగా వుంది. అసలీ పల్లెటూరి వుద్యోగమంటేనే పరమ రోతగా అన్పిస్తోంది.

కాని ఒకప్పుడీ ఉద్యోగమే గొప్ప పెన్నిధిలా అన్పించింది!

ప్రభవ్ యమ్మెస్సీ పాసయ్యాక సుమారు రెండేళ్ళు నిరుద్యోగిగా వున్నాడు. ఎన్ని పోటీ పరీక్షలు రాశాడో ఎన్ని ఇంటర్వ్యూల కెళ్ళాడో లెక్కలేదు. అప్పుడెంత నిరాశా నిస్పృహలకి లోనయ్యాడో తలచుకుంటే ఇప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది.

ఇక తన గీతలో ఉద్యోగరాత లేదేమోనని కృంగిపోతున్న వేళ మహా దప్పికతో అలమటిస్తున్న వాడికి అమృత కలశం లభించినట్టుగా గ్రామీణ బ్యాంకులో ఆఫీసర్ ఉద్యోగం వచ్చింది.

సుమారు అయిదువేలు జీతం. యమ్డీవోతో సమానమైన హోదా.

ఎగిరి గంతేసి వచ్చి జాయినయ్యాడు.

రెండు నెలల పాటు ట్రైనింగు ఇచ్చి ఆ పల్లెలోని బ్రాంచికి మేనేజరుగా వేశారు.

పాతికేళ్ళకే బ్యాంకు మేనేజరైనందుకు బంధుమిత్రు లంతా అభి

సందనలతో ముంచెత్తారు. నీ అంత అదృష్టవంతుడు లేడు గాక లేడు అన్నారు.

అంతే కాదు. పిల్ల నివ్వడానికి పోటీ పడ్డారు కూడా.

చివరకు రెండున్నర లక్షల కట్నంతో వచ్చిన దీప్తి అతడి భార్య అయ్యింది.

పెళ్ళయ్యే వరకూ పల్లెలోనే గది అద్దెకు తీసుకుని వుండేవాడు.

పెళ్ళయ్యాక భార్యని అక్కడికి కాపురానికి తీసుకురావడం ఇష్టం లేకపోయింది. ఆ ఊరు తన హోదాకి చాలా తక్కువగా అనిపించింది' దానికి తోడు పట్నంలో పుట్టి పెరిగిన దీప్తి కూడా 'ఆ కుగ్రామంలో వుండి రాడదు బాబూ' అనేసింది !

దాంతో నలభై కిలోమీటర్ల దూరంలో వున్న టౌన్లో మకాం పెట్టాడు. రోజూ స్కూటర్ మీద షటిల్ చేస్తున్నాడు ప్రభవ్.

మూడేళ్ళలా తిరిగే సరికి కాళ్ళు లాక్కొచ్చాయి. టౌన్ బ్రాంచికి ట్రాన్స్ఫర్ కోసం ప్రయత్నించాడు గాని కుదర్లేదు.

"ఎన్నాళ్ళా పల్లెలో మగ్గిపోతారు ? మీరు మెత్తగా వుంటారు గనుకే అక్కడ పారేసి వుంచారు!" అంటూ భార్య సణగడం ఎక్కువైంది.

ఈలోగా ఓ సంఘటన జరిగింది.

అతడు బ్యాంకుకి వెళ్ళిపోయాక దీప్తికి కడుపు నొప్పి వచ్చింది. ఏవో మందులు మింగింది. సోడా తాగింది. అయినా ఎక్కువైంది తప్ప ఏ మాత్రం తగ్గలేదు. అతడ్ని పిలవడానికి బ్యాంకుకి ఫోను లేదు. మనిషితో కబురంపడానికి వీలు కానంత దూరమాయె.

ఏం చెయ్యాలో తోచక ఏడ్చేసింది. బాధతో మెలికలు తిరిగి పోయింది.

ఇరుగు పొరుగు వచ్చి సానుభూతి చూపారు తప్ప చేయూత నివ్వ లేకపోయారు. ఎవరిళ్ళలోనూ మగాళ్ళు లేరు మరి. ఇహ నొప్పి భరించ లేని స్థితిలో ఆటోని పిలవమని ప్రతిమాలింది. ఎవరో పిలిచారు. హాస్పి టల్ కెళ్ళి తానే జాయినయ్యింది. అపెండిసైటిస్ ఆపరేషన్ చేశారు.

సాయంత్రం తిరిగొచ్చాక గాని తప్పిన గండం గురించి ప్రభవ్‌కి తెలియలేదు.

అవాళ్టి నుంచి పల్లవి మార్చింది దీప్తి- "మీరు టౌన్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించుకోకపోతే నేను పుట్టింటి కెళ్ళిపోతాను" అంటూ.

దాంతో ఎలాగైనా టౌన్‌కి ట్రాన్స్‌ఫర్ చేయించేసుకోవాలని తన ప్రయత్నాలని ముమ్మరం చేశాడు ప్రభవ్.

చైర్మన్‌ని కలిసి రిక్వెస్ట్ చేశాడు గాని ఆయనేం మెత్తబడలేదు.

పైగా ప్రపంచాన్ని మార్చగల శక్తి యువకులకే వుంది. మీరు తలచుకుంటే గ్రామాలని నందన వనాలుగా తీర్చి దిద్దొచ్చంటూ ఉప న్యాసం ఇచ్చారు.

"పుస్తకాల కబుర్లు నేనూ చెప్పగలను" అనుకునొచ్చేసి ఆఫీసర్ల అసోసియేషన్ లీడర్లని కలిశాడు.

"టౌన్ బ్రాంచికో హెడ్డాఫీసుకో వేయిస్తాం గాని గొడవచెయ్యకు" అని హామీ ఇచ్చారు నాయకులు.

అదంతా మననం చేసుకుని "ఇంకా ఈ వనవాసం ఎన్నాళ్లో !" అని నిట్టూర్చాడు ప్రభవ్.

అల్లంత దూరాన బ్యాంకు కన్పించింది. బయట పగిమంది వరకూ జనం గుమిగూడి వున్నారు.

అతడి గుండె లయ తప్పిందో క్షణం.

హెడ్డాఫీసు నుంచి చైర్మనో ఇన్‌స్పెక్టరో రాలేదు కదా ?

అప్రయత్నంగా వాచీ చూసుకున్నాడు.

పదకొండూ అయిదు.

వెధవ బస్సు వల్ల లేటైపోయింది. ఏదో చెప్పి నమ్మించాలను కున్నాడు.

అప్పుడేదో గుర్తొచ్చి చూశాడు. బ్యాంకు ముందు జీపు లేదు.

తేలిగ్గా విశ్వసించాడు "అయినా ముందుగా కబురు చెయ్యకుండా ఈకక్కడి కెవరొస్తార్లే. పుద్దూ బెద్దూ ఏర్పాటు చెయ్యొద్దూ!" అను కున్నాడు.

"అదిగో మేనేజరుగా రొచ్చేశారు."

"నమస్కారమండీ"

గ్రామస్తులంతా లేచి నిలబడి విష్ చేస్తూ దారిచ్చారు.

లోపలి కెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు. ఫాన్ వేసి మంచినీళ్ళు తెచ్చిచ్చాడు వ్యాసు.

"పదకొండింటికా బ్యాంకు తెరిచేది ?" అని ఎవరైనా ప్రశ్నిస్తా రేమోనని కించిత్తు అధుర్దాగా చూశాడు. డిపాజిట్ల కోసం వెళ్ళినందున ఆలస్యమైందని జవాబివ్వాలని కూడా ఆలోచించి పెట్టుకున్నాడు.

కానెవ్వరూ ఏమీ అడగలేదు. అతడు రావడమే గొప్ప బ్యాంకు తెరవడమే మహా గొప్ప- అన్నట్టు చూశారు.

బ్రీఫ్ కేస్‌లోంచి తాళాలు తీసుకుని సేఫ్ తెరచి కేషియర్‌కి దఖ్నిచ్చి కూర్చున్నాడు ప్రభవ్.

డబ్బు చెల్లింపులూ జమలూ చకచకా పూర్తయ్యాయి. జనం పలచ బడిపోయారు. పేపర్ చదవడానికీ, కాలక్షేపానికి వచ్చి కూర్చున్న వాళ్ళే మిగిలారు.

మోటుగా బలంగా ఎత్తుగా వున్న ఒకతను చెమట్లు కక్కుకుంటూ వచ్చి తాళిబొట్టూ చెవి కమ్మలూ తెచ్చి టేబుల్ మీద పెట్టాడు.

ఏవిటన్నట్టు చూశాడు ప్రభవ్.

"మాదీ పకూర్కరండి. నా పేరు బోలయ్యండి. అంతా బోలిగా ఈంటారండి...."

"అంటే అవనీవయ్యా. మధ్యన నాకెందుకు ? ఇవేంటి ?" నగల్ని చూపిస్తూ అడిగాడు.

"డబ్బు కావాలండి"

"ఓహో- గోల్డ్ లోన్ కావాలా. ఇవాళ ఇవ్వం. బుధవారం రా"

"చాలా జరూరు బాబయ్యా. మా ఇంటి దాని పేణం మీదికొచ్చింది. ఆసుపత్రికి తీసుకెళ్ళాల. చేతిలో పైసా లేదు. తవరు కనికరించాల ..." ఏడుపు స్వరంతో అన్నాడు.

"అవసరం లేందే అప్పుకి రావని నాకు తెలుసులేవయ్యా. ఇవాళ ఇవ్వటం కుదరదంటే కుదరదంతే"

"పోనీ ఇవి అట్టం పుంచుకుని తవరో వందరూపాయలివ్వండి. బుధోరం అప్పులోంచి తెగ్గోసుకుందురు గాని"

"నేన్నీ కళ్ళకి మార్వాడీలా కన్పిస్తున్నానా ? వెళ్ళెళ్ళవయ్యా. పొద్దున్నే భలే బేరం దొరికింది"

అసహాయంగా చూశాడు.

అర్థింపుగా చూశాడు.

తడి కళ్ళతో చూసాడు.

అయినా ప్రభిప్ కరగలేదు. అతడి వంక చూస్తే కరగాల్సి వస్తుందనో ఏమో తల దించుకుని లెడ్జర్లో దూరుకుపోయాడు.

భారంగా అడుగులేసుకుంటూ వెళ్ళిపోయాడు పోలయ్య.

"చాలా అర్జంటనుకుంటానండి. ఎప్పుడోగాని రాడండి. చాలా మంచోడండి. పోనీ ఇవ్వండి సార్" ప్యూన్ అన్నాడు.

సన్నగా మెత్తబడుతోన్న అతడి మనస్సా మాటలకి గట్టిగా బిగుసుకు పోయింది.

పోస్టమేన్ వచ్చి ఉత్తరాలిచ్చాడు. హెడ్డాఫీసు నుంచొచ్చిన కవర్లో చైర్మన్ రాసిన డీవో లెటర్ వుంది. ఋణ వసూళ్ల పరిస్థితి అధ్వాన్నంగా వుందనీ వెంటనే తగిన చర్య తీసుకోమనీ రాశాడాయన.

ప్రభవ్ ఒళ్ళు మండిపోయింది. దినపత్రిక తిరగేస్తోన్న కష్టమర్ల నుద్దేశించి అన్నాడు "చూశారా. రికవరీ బాగాలేదని మా చైర్మన్ తాఖీదు పంపించాడు. అప్పు తీసుకునేప్పుడు అమ్మా బాబూ అంటారు. కడుపూ కాలూ పట్టుకుంటారు. అప్పు ఇచ్చేక మళ్ళీ అయిపు వుండరు. వాళ్ళిళ్ళ చుట్టూ మేం తిరగాలి. తిరక్కపోతే ఇవిగో ఇలాగే వస్తాయి శ్రీముఖాలు!"

"ఈ ఏడూ పంటలు దెబ్బతిన్నాయి కదండీ ఎక్కడ్నుంచి తెచ్చి కడతారు చెప్పండి...." ఒకతనన్నాడు.

"ఎప్పుడూ ఏదోటి అవుతూనే వుంటుంది. ఓసారి పంట దెబ్బ తింటుంది. ఇంకోసారి సరైనా రేటుండదు మరోసారి పెళ్ళో చావో వస్తుంది. మధ్యన మేం నలిగి ఛస్తున్నాం కదా. అసలు అప్పులేమీ ఇవ్వకుండా కూర్చుంటే హాయి అన్పిస్తోంది. రికవరీ రాలేదన్న బెంగా వుండదు రికవరీ కోసం మిమ్మల్ని మిమ్మల్ని దేబిరించాల్సిన ఖర్మా పట్టదు"

"అదేంటండి అలాగంటారు. మీ బేంకొచ్చేక ఎంతో కొంత అప్పు పుడుతోందని మేం సంతోషపడుతున్నాం. ఇది వరకు బుల్లెయ్యగారి దగ్గర కెళ్తే భూమో బంగారమో తాకట్టు పెట్టుకుని అయిదు రూపాయల వడ్డీకి అప్పిచ్చేవాడు"

"మీకలాటి వాళ్ళే వుండాలయ్యా. వాళ్ళకైతేనే సరిగ్గా తీరుస్తారు. మేం రూపాయి వడ్డీకిచ్చినా మాకెవరూ సరిగ్గా కట్టరు. అసలు ఇచ్చిన అప్పుని సరిగ్గా వినియోగిస్తే కదా. క్రాప్‌లోన్ అని తీసుకుంటారు. ఏ పెళ్ళికో పండక్కో ఖర్చు పెట్టేస్తారు. ఇంక వీళ్ళు బాగుపడరు" నిస్పృహగా అన్నాడు ప్రభవ్.

అంతవరకూ సీరియస్‌గా పేపర్ చదువుతోన్న మరొకతను పేపరు మడిచి ప్రక్కన పెట్టి అన్నాడు "మేనేజరుగారూ- మీకు చెప్పేంత వాణ్ణి కాదు గాని నాదో చిన్న మనవి. మీరు పంట ఋణం ఇచ్చారు. పండించడానికే వుపయోగిద్దామనుకుని ఇంటికి తీసుకెళ్ళాడనుకోండి. ఇంటికెళ్ళే సరికి ఎవరికో సుస్తీ చేసుంటొచ్చు. పిల్లాడికి స్కూలు ఫీజు కట్టాల్సి రావొచ్చు లేదా ఇంకేదో అత్యవసర ఖర్చు రావచ్చు. అప్పుడా రైతు ఋణం సొమ్మని వాటి నిమిత్తం వుపయోగించొద్దంటే ఎలా చెప్పండి? నువ్వూ నీ కుటుంబం ఎలా పోయినా ఫర్లేదు నీ పంట బాగుండాలి గనుక పండించడానికే వుపయోగించి తీరాలనడం ఏం సబబు చెప్పండి ?"

ప్రభవ్ మొఖం పాలిపోయింది. కించిత్తు అవమానంగా అన్పించింది కూడా. "పై వాళ్ళు పెట్టిన రూల్సలా వున్నాయి. మధ్యన నేనేం చేస్తాను ?"

ఆ సంభాషణని అక్కడితో ఆపేద్దామని మరో పని అందుకున్నాడు గాని ఆ ఆసామీ వదల్లేదు.

"మీరేమీ అనుకోనంటే ఒక్కమాట మేనేజరుగారూ. మీ బ్యాంకులు ఎన్నో రకాల పరిశ్రమలకి అప్పులిస్తూంటాయి కదా. వారిక్కావల్సిన ముడి సరుకుల ఖర్చు, సరుకు అమ్మటానికయ్యే ఖర్చు వుద్యోగుల జీతభత్యాల ఖర్చు బోనస్సు ఖర్చు. ఆఖరికి క్వార్టర్ల ఖర్చు వగైరా వగైరాలన్నీ జాగ్రత్తగా లెక్క కట్టి మరీ అప్పు ఇస్తారు కదా. మరి వ్యవసాయాన్ని కూడా పరిశ్రమగా గుర్తించి రైతు అవసరాల్ని వనరుల్ని ఆదాయాన్ని అన్నీ లెక్కలోకి తీసుకుని అప్పు ఇస్తే రైతూ బాగుంటాడు అతడి కృషీ బాగుంటుంది కదా"

"ఇవన్నీ పై వాళ్ళకి తెలీవనుకోకండి. వారి సాధక బాధకాలు వారికుంటాయి" చిర్నవ్వుతో తేల్చెయ్యాలని చూశాడు.

"అవునులెండి. ఏసీ రూముల్లో కూర్చుని పథకాలు వేసే వాళ్ళకి ఆరుగాలం కష్టపడే రైతు బాధలేం తెలుస్తాయి. రైతు ఏమైపోయినా ఫర్లేదు అతడు పండించే పంట బాగుంటే చాలని చూసే పచ్చి స్వార్థ పరులు!" లేచి చక్కా పోయాడతడు.

"ఇదెక్కడి బిడ్డురా బాబూ!" ప్రభవ్ మాటలకి నవ్వేరంతా.

ఒంటి గంట దాటుతోంటే చక్రధర్రావుగారి మనిషొచ్చి పెళ్ళి భోజనానికి రమ్మని గుర్తు చేసెళ్ళాడు.

"మర్చిపోయాను సుమా. ఇవాళ చక్రధర్రావుగారమ్మాయి పెళ్ళి. డిపాజిట్ ఇస్తానని ప్రామిస్ చేశారు కూడా. భోజనానికి వెళ్ళాల్సిందే. త్వరగా కేష్ క్లోజ్ చేసెయ్యి" కేషియర్తో చెప్పేడు.

బ్యాంకు స్టాఫ్ అంతా పెళ్ళివారింటి వైపు స్కూటర్ల మీదెళ్తోంటే అంతా పక్కకి తొలగి దారిచ్చారు.

పెద్దల్తో కూర్చుని కబుర్లు చెబుతోన్న చక్రధర్రావుగారు ప్రభవ్ని చూసి లేచి ఎదురొచ్చి ఆహ్వానించారు. బంధువుల కతడిని గొప్పగా పరిచయం చేసి లోపలికి తీసుకెళ్లారు.

అక్కడున్న అందరి కన్నా చిన్నదైన తనకి లభిస్తోన్న గౌరవ మర్యాదలకి ప్రభవ్ భుజాలు రెండంగుళాలు పొంగాయి.

ప్రత్యేక బంతిలో కూర్చోబెట్టి భోజనాలు వడ్డించారు. కిళ్ళీలు తెప్పించిచ్చారు.

వెంటనే వెళ్ళిపోతే బావుండదని స్టాఫ్ అంతా పందిట్లో కూర్చున్నారు.

అంతవరకూ చుట్ట కాలుస్తోన్న నామాల పెద్ద మనిషి ప్రభవ్ని చూసి చుట్ట విసిరేశాడు. ఓ కుర్రాడి చేత మంచినీళ్ళు తెప్పించమని పుక్క-

లించి పూసి తుమతుముంటూ వచ్చి ప్రభవ్ పక్కనున్న కుర్చీలో కూల బడ్డాడు.

"తమరిదే పూరండీ" మాటల్లోకి దింపుతూ అన్నాడాయన.

"విశాఖపట్నం"

"అమ్మా నాన్నా...."

"అంతా అక్కడే వున్నారు. చదువూ సంధ్యా అన్నీ అక్కడే. నాన్నకి స్టీల్ ప్లాంట్‌లో వుద్యోగం" ఆయన అడగబోయే తదుపరి ప్రశ్న కూడా జవాబిచ్చేశాడు ప్రభవ్.

"బాగుంది బాగుంది. తమరు ఈ వూళ్ళోనే వుంటున్నారాండీ"

"నాలాటి వాళ్ళు ఇక్కడెలా వుండగలరండీ. టౌన్లో వుంటున్నాను".

"అరె! అంత దూరం నుంచి రోజూ తిరుగుతున్నారా. చొ చొ మీరుండటానికి ఇల్లే ఇవ్వలేకపోయారా వూరివాళ్ళ ?!"

"ఆయనుండాలి గాని వూళ్ళో ఇళ్ళకి కొదవేంది" ప్రక్కాయన న్నాడు.

"అబ్బే- ఇలాటి వూళ్ళల్లో ఎలా వుండగలం. సరైన స్కూలా పాడా హాస్పటలా పాడా సినిమా హాలా పాడా పార్కా పాడా!" నవ్వేడు ప్రభవ్.

"మా వూళ్ళో ప్రభుత్వాసుపత్రి వుందండి. కాని డాక్టరే లేడు. ఎవర్నేసినా రావట్లేదండి"

"ఎలా వస్తారయ్యా ఏవుందనిక్కడ ?"

ప్రభవ్ మాటలకి "ఏం లేదిక్కడ ?" అన్న ప్రశ్న సూటిగా వచ్చిందో పక్కనుంచి.

అంతా వులిక్కిపడి అటు చూశారు. నేతాజీ యువజన సంఘం కుర్రాళ్ళు. ప్రభవ్ వెన్నులో ఏదో ప్రాకినట్టనిపించింది.

వాళ్ళ మధ్య గ్రామంలో చాలా కార్యాలు చక్కబెడుతున్నారు. సారా నిషేధోద్యమంలో దొంగ సారాని నిరోధించడంలో మహిళలు విజయ దుంధుభి మ్రోగించడం వెనుక వారి సపోర్టూ సహకారం చాలా వుంది. ఆసుపత్రిలో డాక్టర్ని వేయించడానికి ప్రయత్నిస్తున్నారు. చౌక దుకాణం సవ్యంగా నడిపేట్లు చూస్తున్నారు. వితంతు పెన్షన్లూ గర్భిణీ స్త్రీలకి సహాయాలూ అందేలా చూడటానికి కృషి చేస్తున్నారు. మొత్తానికి వూళ్ళో ఏదో మార్పు తీసుకొస్తున్నట్టే అన్పిస్తోంది. అందుకే వాళ్ళంటే గుబులుగా వుంటోంది కూడా.

"ఇళ్ళున్నాయి. నీళ్ళున్నాయి. సెప్టిక్ లెట్రిన్లున్నాయి. టీవీలున్నాయి. గురుకుల పాఠశాల వుంది. హాస్పటల్ వుంది. అన్ని సరుకులూ లభించే దుకాణాలున్నాయి. ఇంకేం కావాలి సార్ ?"

"డాక్టర్ లేని హాస్పటలూ స్టేండర్డ్ లేని స్కూలూ!" వ్యంగ్యంగా అన్నాడు ప్రభవ్.

"అంతా మీలా టౌన్లని పట్టుకుని వ్రేలాడే వాళ్ళే మరి. ఈ వూరి మీదా, ఈ జనం మీదా ఎందుకు శ్రద్ధ వుంటుంది ?!" అని ఒక యువకు డంటే, "అనలిక్కడున్న వాళ్ళు మనుష్యులు కాదనుకుంటారు కొందరు. వారికి విద్యా వినోదం ఆరోగ్యం కావాలనీ అనుకోరు" అని వ్యాఖ్యానించా రింకొకరు.

"అవునయ్యా. అనుకోం. తప్పేంటి ? అయిదు వేల జీతం వచ్చే ఆఫీసర్ని నేను టౌన్లో హాయిగా బ్రతకక ఈ మారు మూల పల్లెలో మగ్గాల్సిన అవసరం నాకు లేదు"

"మరటువంటప్పుడు ఈ పల్లెటూరి వుద్యోగం మాత్రం ఎందుకో!" అతడి మాటల కంతా నవ్వేశారు.

ప్రభవ్ ముఖం కందగడ్డలా అయ్యింది. ముక్కు పుటాలదు ర్తోంటే నుక్రోషంగా చూశాడు.

నాముల పెద్ద మనిషి కళ్ళించుకుంటూ అన్నాడు "చాలెంద్రా పెద్దంత్రం చిన్నంత్రం లేదు" అని కసురుకుని ప్రభవ్‌తో అన్నాడు "మన దేశం గ్రామాల్లోనే వుందని గాంధీగా రెందుకనేవారో తెలుసా బాబూ ? ఆచారాలూ అభిమానాలూ సంస్కృతీ సభ్యతా ఇలాటి వూళ్ళ ల్లోనే బ్రతికున్నాయని. కాయకష్టం చేసే బడుగు జీవులు దేశానికి అన్నం పెట్టే రైతన్నలు ఇక్కడే నివసిస్తున్నారని. అధిక జనం అత్యధిక దారి ద్ర్యం ఇక్కడే వున్నాయని. దేశంలో ఇలాటి వూళ్ళు బాగుపడాలంటే మీలాంటి చదువుకున్న పెద్దలు పెద్ద మనస్సున్న గొప్పోళ్ళు ఓ చెయ్యి అందివ్వాలి గాని కోప్పడితే ఎలాగయ్యా"

అతడు సలహా ఇస్తున్నాడో మెత్తగా మందలిస్తున్నాడో అర్థం కాలేదు ప్రభవ్‌కి. పొద్దుట లేవగానే ఎవరి మొఖం చూశానో ఏమో అని లోలోన విసుక్కుని మౌనంగా తలూపి లేచి వచ్చేశాడు.

బ్యాంకు మూసేసే టైమయ్యింది.

పాల రంగమ్మ పాలకేన్ తెచ్చిచ్చింది ప్రభవ్‌కి. రోజూ పాలు ఇక్కడ్నుంచే కొనుక్కెళ్తాడు. అతడి కోసం పెందలాడే పాలు పితికి తీసుకొస్తుందామె.

కేషియర్ అడ్డరోడ్డు దగ్గర డ్రాప్ చేసి వెళ్ళిపోయాడు.

అక్కడి కెళ్ళేక తెలిసింది బస్సెళ్ళిపోయిందని. మళ్ళీ రాత్రి ఎని మిదిన్నర వరకూ బస్సులేదు.

ఎటూ పాలుపోక చూస్తోంటే సూరయ్యగారు ట్రాక్టరు మీదెళ్తూ అతడ్ని చూసి ట్రాక్టర్నాపి పలకరించారు.

"ఏం మేనేజరుగారూ బస్సెళ్ళిపోయిందా"

"అవునండీ కొంచెంలో తప్పిపోయింది. అర్జంటుగా వెళ్ళాల్సిన పనుంది. ఏం చేయాలో తోచటం లేదు...." కావాలనే అబద్ధమాడాడు.

"మా మోటారు సైకిలు వేసుకెళ్దురు గాని రండి"

ఆ మాట కోసమే ఎదురు చూస్తోన్న అతడు ఒక్కంగలో వెళ్ళి ట్రాక్టర్ ఎక్కి కూర్చున్నాడు.

ఆయనింటికి తీసుకెళ్ళి చిక్కని టీ ఇచ్చారు. నాలుగు అస్తాల అరటి పళ్ళు బుట్టలో పేక్ చేయించిచ్చారు.

రైతులు పళ్ళూ కాయగూరలూ ఎంతో అభిమానంగా తెచ్చివ్వటం పరిపాటి. అయినా మొఖమాట పడుతున్నట్లుగా అన్నాడు "ఎందుకండీ- అనవసరంగా మీకు శ్రమ...."

"ఇదేం భాగ్యమనీ. మేమే మన్నా కొన్నమా ఏమిటీ. మా తోట లోవే"

థాంక్స్ చెప్పి వారి రాజ్‌దూత్ మీద బయల్దేరాడు ప్రభవ్.

ఇంటి దగ్గర అర్జంటుగా చక్కబెట్టాల్సిన పనులేం లేవు. అయినా చాలామంది కుర్రాళ్ళలా వేగంగా దూకిస్తున్నాడతడు.

మెదడు మాత్రం అనవసరపు తిరుగుళ్ళ గురించీ యువకుల కామెంట్ల గురించీ ట్రాన్స్‌ఫర్ ప్రయత్నాల గురించీ మథనపడుతోంది.

ఊహించని విధంగా ఒక పందీ దాని వెనుక ఒ కుక్కా రోడ్డు కడ్డంగా దూసుకొచ్చాయి. సడన్ బ్రేకు వేశాడు. బండి అడ్డం తిరిగింది. సరిగ్గా అప్పుడు దూసుకొచ్చిన లారీ మోటారు సైకిల్ని డాష్ ఇచ్చింది. అతడెగిరెళ్ళి అల్లంత దూరాన పడ్డాడు.

గిలగిలా కొట్టుకుంటూండటం చూసి లారీ డ్రైవర్ బేజారెత్తి పోయాడు. లారీని ఆపకుండా వేగంగా వెళ్ళిపోయాడు.

ప్రభవ్‌కి చాలా గట్టిగానే దెబ్బలు తగిలాయి. తలకేదో గుచ్చు కున్నందున రక్తం స్రవిస్తోంది. కాలు విరిగినంత బాధగా వుంది. మెడ దగ్గరా భుజాల ప్రక్కనా మోకాళ్ళ దగ్గరా భగ్గున మండుతోంది.

"హెల్ప్.... హెల్ప్...." కీచుగా అరిచాడు బలాన్నంతా కూడ దీసుకుని.

రోడ్డే వెళ్తోన్న ఏ వాహనమూ ఆగలేదు.

అరచి అరచి స్పృహ తప్పి పడిపోయాడు.

పోలయ్యా మరికొందరూ విచార వదనాలతో శ్మశానం నుంచొస్తూ

ఆ దృశ్యం చూసి చలించిపోయారు ఆదుర్దాగా సమీపించి చూశారు. ఊపిరాడుతోంది

మరేమీ ఆలోచించకుండా అతడ్ని భుజాన వేసుకుని ఊళ్ళోకి పరుగుతీశాడు పోలయ్య. అతన్ననుసరించారు మిగతా వాళ్ళు.

ఆరెమ్పి డాక్టరొచ్చాడు. మందులొచ్చాయి. అత్యవసర వైద్యం అందింది. ప్రమాదం తప్పింది.

గ్లూకోజ్ ఎక్కించాక ఎప్పటికో కళ్ళు తెరిచాడు ప్రదీప్.

అతడి చుట్టూ మూగి ఆత్రంగా చూస్తున్నారు గ్రామస్థులు.

వాళ్ళలో హుస్సేను తను విసిరించేసిన పోలయ్యా వున్నాడు. నేతాజీ యువజన సంఘం కుర్రాళ్ళున్నారు. ఇంకా ఎందరో ఊరి జనం పొరుగూరి జనం వున్నారు.

వాళ్ళ కళ్ళల్లోని ఆత్రుతకీ ఆప్యాయతకీ అతడి కళ్ళు చెమర్చాయి

సమయానికి వీళ్ళల్లో ఎవరో రక్షించబట్టి బ్రతికిపోయాడు గాని లేకపోతే మృత్యువెప్పుడో కబళించి వుండేదన్న ఊహ అతడ్ని నిలువునా కుదిపేస్తోంది!

చేతులు జోడించాలని ప్రయత్నించాడు గాని కుదర్లేదు. అతడి ప్రయత్నం చూసి వారిస్తూ "మీరు రెస్ట్ తీసుకోండి. టాక్సీకోసం మనిషెళ్ళాడు. ఎక్సురే తీయిస్తే మంచిదన్నాడు డాక్టరు. రక్తం కూడా ఎక్కించాల్సుంటుందన్నారు. పట్నం ఆసుపత్రికి తీసుకెళదామనుకుంటున్నాం. మీకేం ఫర్లేదు ధైర్యంగా వుండండి. మీకు అండగా మేమున్నాం. మీ గ్రూపు బ్లడ్ గల కుర్రాళ్ళు కూడా వచ్చారు. సమయానికి పోలయ్య చూసి తీసుకురాబట్టి ప్రాణగండం గడిచింది" అన్నాడో యువకుడు.

పోలయ్య వంక చూశాక చూస్తూ "నీ భార్యకెలా వుంది ?" అనడిగాడు హీనస్వరంతో ప్రదీప్.

"పై లోకాల కెళ్ళిపోయింది బాపూ" బాపుయమన్నాడు.

చెళ్ళున కొరడాతో కొట్టినట్టు అదిరిపడ్డాడు. కన్నీళ్ళు చిప్పిల్లాయి.

భార్య ప్రాణం మీది కొచ్చిందనీ బంగారం తాకట్టు మీద అప్పిమ్మని బతిమాల్తోన్న పోలయ్య మొఖం కళ్ల ముందు కదిలింది.

డాక్టరూ మందులూ లేక పాడుబడినట్టుగా ఉండే గ్రామ ఆసుపత్రి రూపం గుర్తొచ్చింది.

పేరుకి పల్లెల్లో ఉద్యోగాలు చేస్తూ పట్నాల్లో ట్యూటోరియల్స్ నడుపుతూ బడి పిల్లలకి వానాకాలపు చదువులు చెప్పే ఉపాధ్యాయులు గుర్తొచ్చారు.

పల్లెల కోసం అంటూ లక్షల్లో కోట్లతో కాగితాల మీద అభివృద్ధి పథకాలు వేస్తూ కాగితాల మీద మాత్రమే అభివృద్ధి చూపించే అధికారులు గుర్తొచ్చారు.

ఓట్ల జాతర్లకి మాత్రమే వచ్చి వాగ్దానాల కుంభవృష్టి కురిపించే నాయకులూ గుర్తొచ్చారు.

అందరికీ హాయీ పట్నా మాత్రం కావాలి. వేళ్ల గురించి పట్టించుకునే వాళ్ళెవరూ లేరు.

ప్రదీప్ కళ్ళ నుండి కన్నీళ్ళ ధారలు కడుతున్నాయి.

అతడి మనస్సు పశ్చాత్తాపాగ్నిలో నిలువునా దహించుకుపోతోంది.

"ఇక్కడా మనుషులున్నారన్నా రెవరో పొద్దుట. కేవలం మనుషులు కాదు. మానవత్వపు మహా వృక్షపు వేళ్ళున్నాయి యిక్కడ" అనుకుంటూ మెల్లగా అన్నాడు—

"మీ ఊళ్ళో మాకో చిన్న ఇల్లు చూస్తారా ?"

—o—

(ఆంధ్రప్రభ దినపత్రిక ఆదివారం అనుబంధం - 23-4-95)